క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులు ప్రారంభిస్తున్న శ్యాంసుందర్

లోకేశ్వరం: సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని పుస్పూర్ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో మంజూరైన సీసీ రోడ్డుకు రూ.13 లక్షలు, రూ.8 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతున్నామని అన్నారు. సర్పంచ్ నర్సయ్య, నాయకులు భోజన్న, బండి ప్రశాంత్, గన్ను నర్సారెడ్డి, పోతారెడ్డి, లింగారెడ్డి, లక్ష్మణ్, సుదర్శన్‌రెడ్డి, సాయారెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీ ఐటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆనంద్



నల్లోల ఆనంద్

నర్సాపూర్(జి): బీజేపీ నిర్మల్ అసెంబ్లీ ఐటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామం నసీరాబాద్‌కు చెందిన నల్లోల ఆనంద్, కోకన్వీనర్‌గా శేఖర్‌ను నియమించినట్లు రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ, పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ నరేశ్ చౌబే ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ నియామకానికి కృషి చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, పార్టీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక



లాటరీ పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

ముధోల్: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ సమక్షంలో శనివారం మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొత్తం 16 యూనిట్లకు 308 మంది దరఖాస్తు చేసుకోగా, ఏడు యూనిట్లకు లాటరీ పద్ధతిన ఎంపిక చేశారు. ఇటీవల నాలుగు యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేయగా, మిగతా నాలుగు యూనిట్లకు బ్యాంకు అధికారులు ఎంపిక చేయనున్నారు. మొత్తం ఏడు యూనిట్ల ఎంపికకు 245 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారు. ఎంపీడీవో సురేశ్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత



ప్రదర్శన ఇస్తున్న కళా బృందం సభ్యులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రభుత్వ పథకాలపై టీఎస్‌ఎస్ కళాబృందం సభ్యులు శనివారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. అతిసారం, మురుగుకాల్వలు, మూఢ నమ్మకాలు, ప్రజలకు అందజేస్తున్న ప్రభుత్వ పథకాలపై ఆటపాట రూపంలో కళాబృదం సభ్యులు వివరించారు. డీపీఆర్వో ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. సభ్యులు లక్ష్మణ్, రాజ్‌కుమార్, తాస్లిమా, మాధవి, సుదర్శన్, పాఠశాల ప్రిన్సిపాల్ అనసూయ ఉన్నారు.

సన్మానం



సర్పంచ్, కార్యదర్శిని సన్మానిస్తున్న విద్యార్థులు

కుంటాల: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్‌లో భాగంగా విఠపూర్ ఉత్తమ పంచాయతీగా పురస్కారం లభించింది. గ్రామంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్పంచ్ గల్లపురం లక్ష్మి, కార్యదర్శి సారికను సన్మానించారు. హెచ్ఎం సాయన్న, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, భీమన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

120 మంది.. ఒకే మరుగుదొడ్డి



శిథిలావస్థకు చేరిన లోకేశ్వరం గ్రంథాలయం ఇదే..

- లోకేశ్వరం గ్రంథాలయంలో కనీస వసతుల్లేవ్
- కూర్చునేందుకు స్థలం లేక అవస్థలు
- ఇబ్బంది పడుతున్న పాఠకులు, అభ్యర్థులు



ఒకే మరుగుదొడ్డి

లోకేశ్వరం: లోకేశ్వరం గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు కనీస వసతులు కరువయ్యాయి. స్థలం సరిపోక కొందరు వెనుదిరుగుతుంటే ఇక్కడ ఉండి చదువుకునే వారికి మూత్రశాలలు, మరుగుదొడ్డి లేక నరకం చూస్తున్నారు. ఉద్యోగ ప్రకటనలు వెలువడిన నుంచి ఇక్కడికి వచ్చే వారిసంఖ్య పెరిగింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు గ్రంథాలయం తెరిచే ఉంటోంది. రోజు 120 మందికి పైగా వస్తున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారు రాత్రి వరకు ఇక్కడే ఉంటున్నారు. పెద్దసంఖ్యలో యువతులు, మహిళలు వస్తున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇంత మందికి కేవలం ఒకే మరుగుదొడ్డి ఉంది.

సరిపోని గదులు

వరుస నోటిఫికేషన్లతో వచ్చే వారి సంఖ్య రెట్టింపైంది. హాలు, చిన్న గదులు ఉన్నాయి. గ్రంథాలయ ఇరుకు గదులోనూ అభ్యర్థులు చదువుకుంటున్నారు. కొద్దిగా ఆలస్యమైన కుర్చీ దొరకని పరిస్థితి. వేసవి ప్రారంభం కావడంతో అందుబాటులో ఉన్న కూలర్లు ఏర్పాటు చేసేందుకు స్థలం లేదు. 2004లో రూ.3 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో గ్రంథాలయాన్ని నిర్మించారు. వర్షం కురిస్తే గ్రంథాలయ భవనం ఊరుస్తోంది. ఇంత మందికి ఒకే మరుగుదొడ్డి ఉండడంతో ఆరుబయటకు వెళ్లి మూత్రవిసర్జన చేయాల్సి వస్తోంది. గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుందని, అధికారులు స్పందించి కొత్తది ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇక్కడకు వస్తున్నాం. మూత్రశాలలు, మరుగుదొడ్డి లేక ఇబ్బంది పడుతున్నాం. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు ఒకే చోటకు వెళ్లడం కష్టంగా ఉంది. అధికారులు స్పందించి కొత్త గ్రంథాలయ భవనం నిర్మించాలని కోరుతున్నాం.

– రాజశేఖర్, లోకేశ్వరం పాఠకుడు

నివేదించాం

లోకేశ్వరం గ్రంథాలయం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. కొత్త గ్రంథాలయ భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే భవనం పనులు ప్రారంభించి పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– పృథ్వీరాజ్, గ్రంథాలయాధికారి, లోకేశ్వరం

వంతెన ఎప్పుడు నిర్మిస్తారు?



వంతెన కొట్టుకుపోవడంతో ఎడ్లబండిలో వస్తున్న గిరిజనులను చూపిస్తున్న సిద్ధార్థ నాయక్

పెంబి: మండలంలోని పసుపుల గ్రామం వద్ద కడెం వాగుపై మూడేళ్ల క్రితం నిర్మించి వంతెన గత జూలైలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఇప్పటికీ పునర్నిర్మాణం చేపట్టలే దు. వంతెన పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలని గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణావత్ సిద్ధార్థ నాయక్ ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. మరో మూడు నెలల్లో వర్షాకా లం సమీపిస్తుందని ఇప్పటికీ ఇంకా వంతెన పనులు చేపట్టకపోవడంతో వచ్చే వానాకాలంలో పసుపుల, హరిచంత్ తండా, తదితర గిరి జన గ్రామాల ప్రజలు ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు రాకపోకలు ఉండవని తెలిపారు. వెంటనే వంతెన నిర్మాణం ప్రారంభించాని డిమాండ్ చేశారు.

ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్ల పరిశీలన



లక్ష్మణచాందలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో డీఎన్‌ఆర్ ఫంక్షనల్ హాల్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లను మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్ రెడ్డి పరిశీలించారు. శనివారం సాయంత్రం ఏర్పాట్లను నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు రావాలని పిలుపునిచ్చారు. మంత్రి తనయుడు, బీఆర్‌ఎస్ జిల్లా యువ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేశ్, మంత్రి పీఏ శ్రీనివాస్, మండల కన్వీనర్ క్రిష్టారెడ్డి తదిరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని జౌలా(బి) గ్రామంలో ఆదివారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ బాశెట్టి రాజన్న తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ హాజరవుతారన్నారు.

రేపు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

లోకేశ్వరం: అబ్దుల్లాపూర్ గ్రామంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని పార్టీ కన్వీనర్ శ్యాంసుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. పంచగుడి, ధర్మోర, వట్టోలి, అర్లి గొడిసెరా, వాస్తాపూర్, జోహర్‌పూర్, కన్కపూర్, అబ్దుల్లాపూర్ గ్రామాల కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి,నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. భైంసా మండల పరిషత్ కార్యాలయ సమీపంలో మండల ఐకేపీ సంఘాల మహిళలు కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ చేయడానికి రూ.8 లక్షలతో నిర్మించిన గోదాంను శనివారం డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీపీ కల్పనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని అన్నారు. భైంసా మండల మహిళా సంఘాలకు రుణాల వడ్డీ రూ. 98 లక్షల 33 వేలు ప్రభుత్వం ఖాతాలో జమచేసిందని, ఇందుకు సంబంధించిన చెక్కులను సంబంధిత అధికారులకు, సంఘం సభ్యులకు అందజేశారు. నియోజకవర్గంలో పంటల నిల్వకు కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయని, స్థల ఎంపిక చేసి త్వరలో నిర్మాణం చేపడుతామన్నారు. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైనెస్ ఉమెన్స్ లీడర్ షిప్ అవార్డులో భాగంగా ఉత్తమ అవార్డును దక్కించుకున్న డీఆర్డీవో విజయలక్ష్మిని సత్కరించారు. సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తూ జీవో నెం. 11ను జారీ చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. మహిళా సమాఖ్య భవనంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, కోఆప్షన్ సభ్యుడు గజానంద్, ఐకేపీ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి ఎనలేని కృషి

కడెం: సీఎం కేసీఆర్ మహిళా లోకానికి ఎనలేని కృషి చేస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా కల్యాణలక్ష్మి, ఒంటరి మహిళ, వితంతు ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, తదితర పథకాలు అమలవుతున్నాయని అన్నారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ జీవన్ రెడ్డి, సర్పంచ్ అనూష, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



చిన్నారికి ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

సాక్షి స్పందన

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేటకు చెందిన పొలాస రవి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయమై ఈనెల 20న 'దాతలు సాయం అందించరూ' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి గ్రామంలోని గల్ఫ్ కార్మిక కుటుంబాల సభ్యులు శనివారం స్పందించారు. బాధిత కుటుంబానికి రూ.19వేలు ఆర్థికసాయం అందజేశారు. రవి కూతురు జ్ఞాపికకు ఈ సాయం అందించారు. వొడ్డేటి శ్రీనివాస్, మోటపలుకుల పోశెట్టి, గొర్రె రాజేందర్, గుండవేని మీనయ్య, గంట రమేశ్, గోనె శంకర్ తదితరులున్నారు.

సమాచారం

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో రెండో షిర్డీగా పేరున్న సాయిబాబా ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. శ్రీ సీతారాముల కల్యాణం కోసం శనివారం మహిళలు వడ్లను నూర్పి చేసి తలంబ్రాలను తయారు చేశారు.

నేడు సీపీఐ జనరల్ బాడీ సమావేశం

నిర్మల్‌టౌన్: మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో ఆదివారం నిర్వహించే సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి విలాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం సమావేశానికి సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు ఎస్.రెడ్డి, ఏ.సీ.లక్ష్మణ్, జాదవ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

భైంసారూరల్: నిరుద్యోగ యువతీ, యువకుల కోసం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం లక్ష్మణ్ తెలిపారు. భైంసా మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని ఐకేపీ భవనంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. జీ4ఎస్ సెక్యూరిటీ సొల్యూషన్స్ హైదరాబాద్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, ఆసక్తి ఉన్న నిరుద్యోగులు విద్యార్హత, బయోడేటా, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

ముధోల్: మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండలంలోని గన్నొర మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు గౌతమ్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలు సాగు చేశారన్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాక నష్టపోతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా అధికారులకు ఫోన్ చేసి మొక్కొజొన్న, పొద్దు తిరుగుడు పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు అశోక్, రైతులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కొనసాగుతున్న పోషణ వారోత్సవాలు

లక్ష్మణచాంద: అన్ని గ్రామాల్లో పోషణ పక్వాడ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. మండలంలోని పార్‌పెల్లి, చామన్‌పెల్లి, మునిపెల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పార్‌పెల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తానూరులో..

తానూరు: భోసి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పాలు, గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయాలతో ఆహారం అందించాలని పోషకులకు వివరించారు. జెడ్పీ పాఠశాలలో వెళ్లి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ మీనాక్షి, సుశీల, ఏఎన్ఎం అనిత, నాయకుడు మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజులు లేకుండా అవకాశమివ్వాలి

ఖానాపూర్: కేయూ పరిధిలో వివిధ కోర్సులకు సంబంధించిన బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఫీజులు లేకుండా పరీక్షలు రాసేందుకు అవకాశమివ్వాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మడిగెల అనిల్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు సబ్జెక్టులు, ప్రాజెక్టు వర్క్, వైవా తదితర వాటిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు బ్యాక్‌లాగ్‌లు సడలింపుగా క్లియర్ చేయడానికి ఒకసారి అనుమతి ఇవ్వాలన్నారు. పెరిగిన ఫీజులతో పేద విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించలేని పరిస్థితి ఉందన్నారు.

గోడపత్రాలు విడుదల

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏప్రిల్ 2న నిర్వహించే హనుమాన్ విజయయాత్ర గోడపత్రాలను బజరంగ్ దళ్ సభ్యులు శనివారం విడుదల చేశారు. ఈ యాత్రకు జిల్లాలోని హిందూ బంధువులందరూ హాజరుకావాలని కోరారు. జిల్లా నాయకుడు కపిల్ కుమార్, పట్టణ ప్రముఖ్ పాతర్ల నరేశ్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పతికే రాజేందర్, పట్టణ అధ్యక్షులు ముప్పిడి రవి, శ్రీనివాస్, అనిల్, మూర్తి, ప్రభాకర్, రమేశ్, ఆనంద్, రాజు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ హాస్టల్ డైలీ వేజెస్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఏడేళ్లుగా సేవలందిస్తూ చాలిచాలనీ వేతనంతో పని చేస్తున్నారని తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి జీతం ఇస్తున్నారని, ఇప్పటికి 9 నెలల వేతనం పెండింగ్‌లో ఉందని అన్నారు. ఈపీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో60 ప్రకారం రూ.15,600 చెల్లించాలన్నారు.

సీఐటీయూ జిల్లా కమిటీ ఎన్నిక

సీఐటీయూ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మెన సురేశ్, ఉపాధ్యక్షులుగా అజర్, నర్సవ్వ, ప్రధాన కార్యదర్శిగా సీఎచ్ భీమ్‌రావు, సహాయ కార్యదర్శులుగా విద్య, భాస్కర్, కోశాధికారిగా ఎస్.రమేశ్, కమిటీ సభ్యులుగా బి.సుజాత, గంగమణి, ఫిరోజ్‌ఖాన్, అనురాధ, ఆర్.పుష్ప, ఎల్.జయశ్రీ, సరస్వతి, కె.విజయ, టి.దేవిదాస్, పోసాని, పూర్ణచందర్, లక్ష్మి, ఇస్మాల్ ఎన్నికయ్యారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: ఆర్టీసీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎం అమృత అన్నారు. ప్రజల వద్దకు ఆర్టీసీలో భాగంగా శనివారం తానూరు మండలంలో ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, దివ్యాంగులకు అందిస్తున్న రాయితీ, బస్‌పాస్‌లపై వివరించారు. అలాగే వివాహ, శుభకార్యాలకు ఒక నెల ముందుగా బస్ బుక్ చేసుకుంటే పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఎస్‌టీఐ సరియా, సుభాష్, అంబదాస్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



మాట్లాడుతున్న డిపో మేనేజర్ సాయన్న

లక్ష్మణచాంద: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సాయన్న అన్నారు. మండలంలోని పీచరలో శనివారం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్‌పెల్లి రూట్‌లో తమ గ్రామం మీదుగా నిత్యం 8 ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామన్నారు. అయినా కొందరు ఆటోల్లో కాకుండా ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేయాలన్నారు. ఉప సర్పంచ్ ముత్తన్న, వీడీసీ సభ్యులు భూమేష్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

పీచర సర్పంచ్‌కు పరామర్శ



లత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామ సర్పంచ్ లత అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్రమంత్రి ఐకేరెడ్డి శనివారం సర్పంచ్ లత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మంత్రి సోదరుడు సురేందర్‌రెడ్డి, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధిలో తవ్వినకొద్దీ అక్రమాలు

- కూలీల వద్ద వారానికి రూ. వంద వసూలు వాస్తవమే
- కందకాల కొలతల్లో అదనంగా రూ.లక్షా 54 వేల చెల్లింపు



కొత్తపేట గ్రామసభలో పాల్గొన్న అధికారులు, కూలీలు

ఖానాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. గత రెండురోజులుగా గ్రామాల్లో కొనసాగుతున్న సామాజిక తనిఖీ గ్రామసభల్లో అక్రమాలు చిట్ట తవ్వినకొద్దీ వెలుగులోకి వస్తున్నాయి. కాగా ఉపాధి హామీ పథకంలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు డబ్బులను కూలీల నుంచి వసూలు చేసినట్లు సాక్షిలో పలుమార్లు గతంలో రాసిన కథనాలు వాస్తవమనే విషయం తనిఖీలో వెల్లడైంది. కొత్తపేటలో వారానికి రూ.100, రూ.200 ఆపై చొప్పున మేట్లు వసూలు చేసినట్లు కూలీలు తనిఖీ బృందానికి లిఖిత పూర్వకంగా రాసివ్వడంతోపాటు గ్రామసభకు హాజరై బహిరంగంగా తెలియజేశారు. ఆ డబ్బులు టీఏలకు ఇచ్చినట్లు మేట్లు గ్రామసభలో తెలియజేశారు. పలువురు మేట్లు 24 మంది కూలీల వద్ద రూ. 26 వేలు వసూలు చేసినట్లు బీఆర్‌పీ ఆకాంక్ష తెలిపారు. హరితవనంలో 1500 మొక్కలు నాటితే కేవలం 50 వరకే బతికి ఉన్నాయన్నారు. కందకాల తవ్వాకాల్లో అధిక కొలతలు రికార్డుల్లో చూపి రూ.1,54,000 అదనంగా చెల్లించారని తెలిపారు. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ హెల్పర్‌కు పని కల్పించి రూ. 11 వేలు, పంచాయతీ మల్టీవర్కర్‌కు రూ.5,600 చెల్లించారన్నారు.

ఉద్రిక్తంగా గ్రామసభ

కొత్తపేటలో కూలీల నుంచి డబ్బులు వసూలు చేసిన విషయం వెలుగులోకి రావడంతో సభలో పలువురు కూలీలు, నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సేవ్యానాయక్‌తండా, దిలావార్‌పూర్, దేశ్యానాయక్‌తండా, కోలాంగూడ, అడవిసారంగాపూర్, ఎక్బాల్‌పూర్, గ్రామాల్లోని గ్రామసభల్లో పలు అక్రమాలు వెలుగుచూశాయి. కార్యక్రమంలో సర్పంచులు కాశవేని సునీత, దినేశ్, గుగ్లావత్ రమేశ్, మిర్యాల హరిత, గుగ్లావత్ లక్ష్మణ్, మాడావి జంగుబాయి, గంగామణి, ఎస్ఆర్పీలు మహేశ్, రాఘవ, కార్యదర్శులు ఉన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

నర్సాపూర్(జి): ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీకాంత్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుకను తరలించేవారు ట్రాక్టర్‌కు రూ.800, ఎడ్లబండికి రూ.200 చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. రసీదు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే మొదటి సారి పట్టుబడ్డ ట్రాక్టర్‌కు రూ.5 వేలు, రెండోసారి రూ.15 వేలు జరిమానాతోపాటు ట్రాక్టర్‌ను జప్తు చేస్తామని తెలిపారు. ఇసుకను జేసీబీతో తోడి పట్టుబడితే మొదటిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. ఆర్ఐ వేణుగోపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్‌లోని పాత దవాఖాన స్థలాన్ని ఆక్రమణకు కాకుండా చర్యలు తీసుకోవాలని తిమ్మాపూర్ వీడీసీ నాయకులు కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అంకం రాజేందర్, కమిషనర్ రత్నాకర్‌రావులకు వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని అన్నారు. ఆ స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని కాపాడాలని కోరారు. నాయకులు రాజన్న, లక్ష్మణ్‌రావు, సురేశ్, గంగారావు ఉన్నారు.